# చెడిపోయిన మనిషి

'పట్టుదల ముందు పుట్టి తరవాత మా పార్వతీశం పుట్టాడు, అంటూండేది ఆయన తల్లి. ఒకసారి కాదు, ఒకరితో కాదు; లక్షమందితో లక్షన్నరసార్లు.

పట్టుదల అన్నది పార్వతీశానికి బుద్ధి తెలిసినప్పటినుంచీ ఒక బిరుదన్నభావం ఏర్పడిపోయింది. లోకం నీకు రూపం ఇస్తుంది. నువ్వెలాటి వాడివని లోకం కోడై కూస్తే అలాటి వాడివిగానే తయారు కావటానికి నువు నీ జీవశక్తిని ధారపోస్తావు. మహాదాతలూ, మహావీరులూ చాలామంది ఆ విధంగా తయారైన వాళ్ళేనేమో! మహాకవులూ, మహామేధావులూ మొదలైనవాళ్ళు మటుకు ఈ విధంగా తయారు కాలేదు. అందుకు 'కండిషనింగ్' ఒకటే చాలదు. మనిషిలో స్వతహాగా కొంత 'పిండి' ఉండాలి. అయినా మరొకడు మహాకవిఅనీ, మహామేధావిఅనీ, మహాపురుషుడనీ ఇతరులు అనుకునే టట్టుగా 'కండిషనింగ్' జరగవచ్చు—జరుగుతూనే ఉన్నది కూడా.

మనకు ప్రస్తుతం కావలసింది పార్వతీశం పట్టుదల. అవును. చాలా దశాబ్దాలుగా పార్వతీశం పట్టుదల లోకప్రసిద్ధమయింది—పార్వతీశం జీవించిన చిన్నలోకంలోనే అనుకోండి. అచ్చంగా తల్లి యిచ్చిన కితాబువల్లనే పార్వతీశం పట్టుదల మనిషి అయినాడనుకో నవసరం లేదు. అతని మేనమామలిద్దరూ 'మొండివాళ్ళు' అనే కీర్తి తెచ్చుకున్నారు. వాళ్ళ మొండితనాన్ని పట్టుదల అని ముద్దుగా చెప్పుకునేవాళ్ళు లేక పోయారు.

తన యాభై అయిదేళ్ళ జీవితంలోనూ పార్వతీశం తన మొండితనాన్ని ఒక పతకంలాగా, అందరికీ కనిపించేటట్టు, ధరించి తిరిగాడు. వీలయినచోట తన మాట నెగ్గించుకుని వీరుడనిపించుకున్నాడు. వీలుకానిచోట తనపంతం చెడకుండా దక్కించుకుని నష్టపోయి మహావీరుడనిపించుకున్నాడు—కనీసం తనకు తాను అనుకున్నాడు.

పై వాళ్ళదేమిటిలెండి? లోకులు పలుగాకులు! కొందరు పార్వతీశాన్ని మూర్ఖుడన్నారు. మరికొందరు శఠుడన్నారు. ఇంకా కొందరు రాక్షసుడూ, బండరాయీ, కర్కోటకుడూ అని కూడా అన్నారు. పైవాళ్ళే కాదు, దగ్గరివాళ్ళు కూడా ఆయనను అటువంటి మాటలన్నారు.

తన అత్తవారిళ్ళతో కూడా పేచీ వచ్చి పార్వతీశం తన భార్యను ఒక కాలు శతాబ్దంపాటు పుట్టింటి గడప తొక్కనివ్వకపోతే ఆ యిల్లాలు తన భర్తను తన మనసులో కర్కోటకుడనే తిట్టుకున్నది.

పార్వతీశం కొడుకులిద్దరూ తండ్రిమూలంగా కత్తిమీద సాముచేసి, తండ్రికి అన్ని రకాల శాపనార్థాలూ పెట్టి, చివరకు రెక్కలు రాగానే ఎగిరి చక్కా పోయారు.

పుష్కలంగా డబ్బు గలవాడై ఉంటే పార్వతీశం పట్టుదల నలుగురికీ నదరుగా కనిపించేది. రాణింపుకూ వచ్చేది. కాని చింతపండు వీశె బేడా అర్థణాకు అమ్మిన రోజుల్లోనే పార్వతీశం బీదతనానికి కూతవేటుదూరంలో ఉంటూవచ్చాడు. స్కూలు ఫైనల్ దాకా చదివి టైపింగ్ షార్ట్‌హాండ్ పరీక్షలో జిల్లాకంతకూ పెద్ద మార్కు తెచ్చుకున్నాడు. ఆ ఏడే పదేళ్ళ పిల్లను పెళ్ళాడి అత్తవారిచ్చిన కట్నంతో ఒక ఇన్‌స్టిట్యూటు ప్రారంభించాడు. దాన్ని నడుపుతూనే పెద్దపరీక్షలు పాసై, టైపింగ్‌లో అసాధారణ శక్తి గలవాడనిపించుకున్నాడు.

'ఎట్లాగైనా పార్వతీశందే పట్టుదల అంటే!' అని చాలామంది మెచ్చుకున్నారు.

పట్నంలో ఏదో పెద్ద కంపెనీవాళ్ళు స్టెనో కోసం ప్రకటన వేశారు. 'నీ కా ఉద్యోగం సునాయాసంగా దొరుకుతుంది' అని నలుగురూ ఉబ్బేసిన మీదట ఆ ఉద్యోగం కోసం అప్లయి చేశాడు. ఇంటార్వ్యూకు వెళ్ళాడు. దొర చెప్పిన డిక్టేషను తీసుకుని, ఒక్క తప్పు లేకుండా టైప్ చేసి ఇచ్చి, వెంటనే ఉద్యోగం సంపాదించాడు. నెల తిరగకుండానే దొరతో పోట్లాడి, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇంటికొచ్చేశాడు.

ఉద్యోగానికి దరఖాస్తు పెట్టమన్నవాళ్ళే 'మూర్ఖుడు' అన్నారు.

ఒక సిద్ధాంతానికి నిలబడినవాడు తన సిద్ధాంతంద్వారా లోకానికి మహోపకారం చెయ్యలేనివాడు అనేకమందికి హాని మాత్రమే చేస్తాడు. కాని అందుకు లక్ష్యపెట్టడు. పట్టుదల అన్నది కేవలమూ వ్యక్తిపరంగా ఉన్నప్పుడది లోకానికి చెయ్యగల మహోపకారమేమీ ఉండదు.

పార్వతీశం తన దగ్గిరవాళ్ళలో ఏ ఒకరికీ ఏనాడూ ఆవగింజంత సుఖాన్ని తన పట్టుదలద్వారా కలిగించలేదు. కాని కష్టాలూ, మనఃక్లేశమూ పుష్కలంగా కలిగించాడు.

అసలు పార్వతీశం వంటివాడి 'సెల్ఫ్ ఫుల్ఫిల్‌మెంటు'కు చుట్టుపక్కల వాళ్ళు కష్టాలుపడటం అత్యావసరంకూడానూ. కల్లోలిత సముద్రం మధ్య ఉన్న కొండలోనే దాని నిశ్చలత్వం రుజువయేది.

పార్వతీశాన్ని భార్య వదిలిపెట్టి లోకాంతరాలకు వెళ్ళిపోయింది. అంతకు ముందే కొడుకులు ఆయనను వదిలిపెట్టి దేశాంతరాలకు - అంటే ఆంధ్రప్రదేశాంతరాలకు - వెళ్ళిపోయారు. వాళ్ళు తమ భార్యా బిడ్డలతో ఎట్లా కాపరంచేస్తున్నారో పార్వతీశానికి తెలీదు. వాళ్ళు బాగానే సంపాదించుకుంటున్నారని మాత్రం విన్నాడు. వాళ్ళు ఆయనకు ఏనాడూ ఎర్రని ఏగానీ పంపలేదు. పట్టుదలే ఒక పెట్టని అలంకారంగా గల పార్వతీశం వారిని ఒక రోలీ యాచించనూలేదు.

పట్టుదలే పెట్టని అలంకారంగాగల వాడిలోకూడా ఏ మూలో మానవదౌర్బల్యం ఉంటుంది. పార్వతీశంలో అది కూతురిచుట్టూ గూడుకట్టుకుంది. తన చిన్నతనంలో తల్లి మీద ఉండిన మమకారమంతా కూతురి మీదికి తిప్పుకున్నా డాయన. కూతురికి 'వర్ధని' అని తల్లిపేరే పెట్టుకున్నాడు.

వర్ధనిని పార్వతీశం గారాబంచేసి చెడగొట్టాడనడం అతిశయోక్తి అవుతుంది. పార్వతీశం గుండెలో ఒకరిని గారాబంచేసేటంత 'చెమ్మ' ఏనాడూ లేదు. కాని తన కొడుకులల్లే వర్ధని తనను ద్వేషించదనీ, తన పట్టుదలను గౌరవిస్తుందనీ నమ్మాడు. ఆ నమ్మకానికి విఘాతం కలిగేటట్టుగా వర్ధని వాక్కాయకర్మలేవీ ప్రదర్శింపలేదు.

వర్ధని స్కూలుఫైనలుదాకా చదువుకున్నది. అప్పుడు పార్వతీశానికి ఆమె పెళ్ళిగురించి ఆలోచన వచ్చింది. ఎరిగున్న వాళ్ళను కొందరిని కదిపిచూశాడు. ఆడ పిల్లపెళ్ళి కట్నాలతో కూడుకున్నదని వాళ్ళన్నప్పుడు పార్వతీశానికి మండి పోయింది. కట్నాల విషయం తెలియకకాదు. తనను—పార్వతీశాన్ని! - కూడా కట్నాలివ్వమని సలహా ఇవ్వగల ధైర్యసాహసాలు ఇతరులకుండటం తల తీసేసి నట్టనిపించింది.

"కట్నాలు తీసుకోకుండా పిల్లలను చేసుకుంటున్నవాళ్ళు బోలెడుమంది ఉన్నారు" అన్నాడు పార్వతీశం.

"ఎక్కడున్నారు? కాస్త చూపించి పుణ్యం కట్టుకోండి." అన్నారు ఆయన హితైషులు.

నిజానికి పార్వతీశానికి కట్నం ధారపోసే సత్తాలేదు. పెళ్ళి ఖర్చులు - అవైనా తేలికలో పోయేటట్టుంటే భరించగలడు, ఆ పైన ఆయనవల్లకాదు. కాని ఆయన, 'నా దగ్గిర లక్షరూపాయలున్నా కట్నంపోసి నా కూతురికి మొగుణ్ణి తీసుకు రావటం అవమానకరం!' అని తనను తాను నమ్మించుకుని అటుతరువాత అదే తన నియమం అయినట్లుగా ప్రవర్తించాడు.

చిత్రమేమిటంటే వర్ధనికి కట్నాలు కోరని సంబంధాలు వచ్చాయి. 'కట్నం ఇవ్వను' అన్న తన నియమాన్ని అవహేళన చెయ్యడానికి వచ్చినట్టుగా అవి వచ్చాయి. ఒకడు వయసుమళ్ళిన రెండో పెళ్ళివాడు. ఒకడు వయసు అంతగా మళ్ళని మూడో పెళ్ళివాడు. ఇంకొకడు పెళ్ళాంతోబాటు, మామగారింట తిష్ఠవేసి, రెండుపూటలా ఇంత తిండిపెడితే చాలునన్నవాడు.

"ఛీ ఛీ. ఇంతకన్నా నా కూతురు పెళ్ళికాకుండా ఉండటం లక్ష రెట్లు మేలు" అన్నాడు పార్వతీశం.

వర్ధని కూడా ఆ మాటే అన్నది. పార్వతీశం ఆశ్చర్యపడలేదు. 'ఎవడో ఒకణ్ణి పెళ్ళిచేసెయ్యి, నాన్నా!' అని ఆమె అనివుంటే ఆయన నిర్ఘాంతపోయి వుండేవాడు.

వర్ధని అలా అనక, "నా పెళ్ళికోసం ఎందుకు హైరానపడుతున్నావు నాన్నా-ఓపిక వుంటే చదివించు" అన్నది.

"బాగా అన్నావే అమ్మాయ్ ! లేకపోతే ఏమిటి ?" అని పార్వతీశం తన కూతురిని కాలేజీలో చేర్పించాడు.

వర్ధని బియ్యే పాసయింది. ట్రెయినింగు పొందింది. పంతులమ్మ ఉద్యోగం సంపాదించి తండ్రినికూడా పోషిస్తూ వచ్చింది.

ఒక ఏడాది పార్వతీశానికి నిశ్చింతగా గడిచింది. ఆ తరువాత ఒక స్నేహితుడు లాంటి శత్రువు ఆయన తలలో విషబీజం వేశాడు.

పార్వతీశానికి సహజ శత్రువులు కొందరు లేకపోలేదు—ప్రతి నియమవ్రతుడికీ కొందరు శత్రువులు అనుకోకుండానే ఏర్పడుతారు. పార్వతీశం 'పట్టుదల' వల్ల ఆయన భార్యా, బిడ్డలూ పడినంత హింస ఇతరులు పడిఉండకపోవచ్చుగాక. కాని దానివల్ల అవమానం పొందినవాళ్ళు చాలామంది ఉన్నారు. అవమానం పొందటానికి ఎంత కావాలి ? నువు బాగుందన్న సినిమాగాని, పుస్తకంగాని మరొకడు ఏమీ బాగాలేదనీ, వట్టి చెత్త అనీ అంటే నీకు వచ్చే అవమానం ! నా సలహా - ఎంతో ఆప్యాయంగా ఇచ్చినది—నువు తోసిపారేస్తే నాకు తీరని అవమానం ! పార్వతీశం తానెరిగిన వారికి దాదాపు అందరికీ ఇలాటి అవమానాలు చాలా చేశాడు. కాని వాళ్ళు తమ ఆగ్రహాన్ని పైకి చూపలేదు; పైకి స్నేహంగానే ఉంటూ, లోపల కసిని దాచుకున్నారు.

అటువంటి స్నేహితుడొకడు ఒకనాడు పార్వతీశం దగ్గిరికి పని పెట్టుకునివచ్చి, "మరేంలేదుగాని, ఇంతకాలమూ బతికి ఇంటివెనక చచ్చాడన్నట్టు, నీ పౌరుషమంతా ఈనాడు మంట గలిసింది. ఈ వృద్ధాప్యంలో భగవంతుడు నీకు ఏడుపుకూడా రాసి పెట్టినందుకు నాకు మహా విచారంగా ఉంటున్నది" అని వెళ్ళిపోవటానికి లేచాడు.

పార్వతీశానికి 'స్ట్రోక్' వచ్చినంత పని అయింది.

"ఉండు! ఆగు! ఏమిటి నువ్వనేది!" అన్నాడాయన.

"ఎందుకు నా నోటిమీదుగా అనిపిస్తావు !" అంటూ ఆ పెద్దమనిషి, చూరుకు నిప్పంటించి ఆ చాయల లేకుండా వెళ్ళిపోయే గృహ దాహకుడిలాగా నిష్క్రమించాడు.

ఆ తరవాత పార్వతీశం నిజంగా పార్వతీశుడే అయిపోయి, ఆ గరళాన్ని తన కంఠంలోనే ఉంచుకుని, తన కుమార్తెను అతిశ్రద్ధగా గమనించసాగాడు. వెంటనే రుజువు దొరకలేదు.

'అసలు రుజువులెందుకు? ఆ మాధవయ్య ఉన్నమాటే చెప్పివుంటాడు. ఇంత అబద్ధం కల్పించి చెప్పడానికి వాడి కెన్నిగుండెలు?' అన్నది పార్వతీశం అహంకారం.

వర్ధని జీతం రెండువందలు. అంతకుమించి ఆమె ఖర్చుచేస్తున్నట్టు కూడా కనిపించలేదు. లోకులు ఎంత నీచులంటే, ఒక ఆడకూతురు శ్రమించి నాలుగురాళ్ళు తెచ్చుకుంటున్నా, ఒళ్ళమ్ముకు బతుకుతున్నదానికిందనే జమకడతారు.

ఆ మాట అనుకుని తృప్తిపడ్డ రోజునే వర్ధని చాలా పొద్దుపోయి ఇంటికి వచ్చింది. ఇంటిముందు కారు ఆగిన చప్పుడూ, మళ్ళీ కారు బయలుదేరిపోయిన చప్పుడూ కూడా పార్వతీశం విన్నాడు.

“చాలా పొద్దుపోయిందే. ఎవరో కారులో దింపినట్టున్నారు” అన్నాడు పార్వతీశం కూతురితో. ఆయన తన భావాల నేనాడూ దాచుకోలేదు. అది ఆత్మవిశ్వాసం లేనివాడు చేసేపని. అందుచేత ఆయన కంఠధ్వని, బోనులో నిలబడివున్న ముద్దాయిని ప్రాసిక్యూషను ప్లీడరు ప్రశ్నించేదిలాగా వున్నది.

“స్కూలునుంచి తిన్నగా ఒక పార్టీకి వెళ్ళాను. అక్కడ ఆలస్యమయింది. కారులో నన్ను దించినవాడు ఓవర్సీరు రామంగారు” అంటూ వర్ధని తన పని చూసుకోబోయింది.

“ఆగు! ఈ ఓవర్సీరుగార్ని నువ్వెట్టా ఎరుగుదువు? ఆయనకు, నువు చెప్పే పార్టీకి ఏమిటి సంబంధం?” అని పార్వతీశం అడిగాడు.

“ఆ గొడవలన్నీ నీకెందుకు నాన్నా?” అన్నది వర్ధని కొంచెం విసుగుగా.

పార్వతీశంగారికి నిగ్రహం బొత్తిగా పోయింది.

“ఎందుకు సంబంధం లేదూ! నాకిప్పుడు నువు పెట్టే తిండితప్ప వేరేగతిలేదు. నేను పడుపుకూడు తింటున్నానని అదివరకే మాట పుట్టింది. మాట పుట్టటమేమిటి? నా మొహానే అంటున్నారు. నీలో నమ్మకంకొద్దీ ఇంతవరకు నిన్నేమీ అడగలేదు.”

“నేను ఒళ్లమ్ముకుని బతకటంలేదు. ఆ విషయం నిశ్చింతగా ఉండొచ్చు” అన్నది వర్ధని. కాని ఆమె మాటలో సౌమ్యంలేదు, కొంచెం సాహసమే ఉన్నది.

“ఏమైనా నువ్వు పెళ్ళి చేసుకొనడం తప్పనిసరని తోస్తుంది. లేకపోతే ఎవరిష్టం వచ్చిన మాట వాళ్ళని చూస్తారు.”

“అదివరకల్లే నా పెళ్ళి నీ సమస్య కాదు—నా సమస్య.”

“నువు అడ్డమైన ఓవర్సీర్ల కార్లలోనూ తిరుగుతూంటే ఆ సమస్య ఎట్లా పరిష్కారం అవుతుంది?”

“దాన్ని గురించి నీ కెందుకు బెంగ? ఈ ఓవర్సీరుగారు నా మేలు కోరినవాడు. ఈయన అడ్డుపడకపోతే నా ఉద్యోగం నిలిచేదికాదు.”

“తుమ్మితే ఊడే ముక్కులాంటి ఉద్యోగం ఎందుకు చేస్తావు? నాకు దొరల కంపెనీలో తగిన మర్యాద దొరక్కపోయేసరికి రాజీనామా ఇచ్చి వచ్చేశాను! పౌరుషంలేని బతుకేం బతుకు?”

"ఇక్కడ పౌరుషం ప్రసక్తి ఏమీలేదు. రామంగారు నాకు మంచి స్నేహితుడు."

"ఓహో! మీ స్నేహం ఎంతదాకా వెళ్ళిందేం?"

వర్ధని తండ్రికితగ్గ కూతురన్నట్లుగా "నీకెందుకు ఆరాలన్నీ, నాకు మామ గారివా! అత్తగారివా?" అన్నది రౌద్రంగా.

"ఇన్నేళ్లూ నేను ఎవళ్ళో కూడా తెలియదన్నమాట! తెలిస్తే అటువంటి లుచ్ఛాప్రశ్న అడగవు."

తన స్వరూపం కూతురికి తెలిసి రావటానికిగాను పార్వతీశం ఆ ఇంట మరి భోజనం చెయ్యలేదు.

వర్ధని తండ్రిని పిలిచి చూసింది.

"అక్కర్లేదు—పడుపుకూడు!" అన్నాడు తండ్రి.

"పోనీ, హోటలుకూడు పనికివస్తుందేమో, డబ్బులున్నాయా?" అన్నది కూతురు. ఆమె తండ్రిని చాలాకాలం సహించింది. ఆమె ఓర్పు బొత్తిగా నశించింది.

తండ్రి కూతురుకేసి, మూడోకన్ను తెరిచిన శివుడల్లే చూశాడు.

వర్ధని భస్మం అయిపోలేదు.

మర్నాడల్లా పార్వతీశం తిండిలేక బాగా నీరసించిపోయాడు. ఆయన కెందుకో గాని, తాను దాదాపు నలభై ఏళ్ళక్రితం చేసిన మద్రాసు ప్రయాణం మనసులో తెగ మెదులుతున్నది. అది మంచి ఉద్యోగం. అప్పుడే ఎనభై రూపాయలిచ్చారు. ఇవాళ్టి దాకా ఆ ఉద్యోగం ఉండేదే. ఎన్ని ఇంక్రిమెంట్లువచ్చేవో! ఈనాడు తన కూతురి మోచేతికింది నీళ్ళుతాగేపని ఉండకపోను. దొరలకంపెనీ. దొరల దృష్టిలో మనదేశం వాళ్ళు కాస్త సలీసుగానే ఉంటారు. ఈనాడు నాటుదొరలు తమ కిందివాళ్ళను మరీ కుక్కలల్లే చూస్తున్నారుట. తన తరవాతవచ్చిన స్టెనో దొరతోబాటు ఫారిన్‌కూడా వెళ్ళాడని చెప్పుకున్నారు. వెళ్ళాడేమో మరి?....

ఇవే ఆలోచనలు రోజల్లా బుర్రలో తిరగటానికీ, ఆ రాత్రి పార్వతీశం మద్రాసుమెయిలు ఎక్కటానికి ఏదో సంబంధం ఉండి ఉండవచ్చు. ఆయన మద్రాసు కని టిక్కెట్టు తీసుకోలేదు. ఆయన అసలు టిక్కెట్టే తీసుకోలేదు. తీసుకోవటానికి ఆయనజేబులో చిల్లిగవ్వలేదు. ఉన్న చిల్లర డబ్బులుతీసి బల్లమీద పెట్టి బయలు దేరాడు.

రైల్లో ఆయనను ఎవరూ టిక్కెట్టు అడగలేదు. రైలు పెట్టె శవాలగుట్టలతో నిండిన మాజీ యుద్ధభూమిలాగున్నది. అందరూ రకరకాల భంగిమల్లో కూర్చుని నిద్రలుపోతున్నారు. పార్వతీశానికి కూర్చునేటందుకు చోటులేదు. ఎత్తుగా పేర్చి వున్న ట్రంకుపెట్టెలకు చేరగిలబడి తడిలో కూర్చున్నాడు. ఆయనక్కూడా నిద్ర పోవాలని ఉన్నది—మళ్ళీఎప్పటికీ లేవకుండా. తన జన్మ మారిపోయింది. వర్ధనీ, వర్ధని ఇల్లూ, జీవితమూ ఏ జన్మకో సంబంధించినవి లాగున్నాయి. పార్వతీశం

మనసు్స వాటిగురించి ఆలోచించ నిరాకరిస్తున్నది. ముందు నిద్రపోవాలి, ఏదో మత్తులాటిది ముంచుకొస్తున్నది.

*   *   *

డాక్టర్ (మిస్) స్నేహలతారావు ఆగబోతున్న మెయిలులో నుంచి బయటికి తొంగిచూస్తూ, తనకోసం స్టేషనుకు వచ్చిన ప్రభాకర్‌ను చూడగానే నవ్వుతూ చెయ్యి ఊపింది.

ప్రభాకర్ జనాన్ని తోసుకుంటూ వచ్చి కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి రెండు చేతులా ఆమె చేతులను పట్టుకుని "ఫ్రెష్ ఫ్లవర్ లాగున్నావు. గుడ్‌మార్నింగ్-కాదు, బ్యూటిఫుల్ మార్నింగ్" అన్నాడు.

"కారు తెచ్చావా?" అన్నది డాక్టరు.

"నడిచి వచ్చాననుకుంటున్నావా?"

"పోర్టరును పిలు. లగేజి ఈ రెండుసామాన్లే"

పెట్టె, బెడ్డింగూ పోర్టరు నెత్తికెత్తి ఇద్దరూ ప్లాట్‌ఫారం వెంబడి నడవసాగారు. ఇంజనుకి దగ్గరలోవున్న బోగీదగ్గర గుంపు చేరింది.

"పూర్ ఫెలో!....ప్రాణం ఉందా? వాళ్ళ వాళ్ళెవరూ లేరు. ఒంటరిగాడు...." ఇటువంటి మాటలు ఇంగ్లీషు, తమిళం, తెలుగు భాషలలో వినబడుతున్నాయి.

శవంలాగా రైలు పెట్టెలోంచి బయటికి చేరవేయబడుతున్న పార్వతీశాన్ని కళ్ళచూడకపోతే డాక్టరు ఆగకపోయిఉండును. కాని ఆయనను చూశాక డాక్టర్స్ ఇన్‌స్టింక్ట్ ఆమెను ఆపేసింది.

"నేను డాక్టర్ను; చూడనివ్వండి!" అంటూ ఆమె జనాన్ని తోసుకుని పార్వతీశాన్ని చేరుకున్నది. పల్స్‌చూసింది. శ్వాస చూసింది, కనురెప్పలు ఎత్తిచూసింది.

ప్రక్కనే ఉన్న ప్రభాకర్ "డగ్స్?"అని అడిగాడు.

"లేదు. తిండిలేక నీరసించినట్టున్నాడు. ఈయన్ను క్లినిక్‌కు తీసుకుపోదాం-నీ కభ్యంతరం లేకపోతే" అన్నది.

"ఓ, నో. నాపెటాల్!" అన్నాడు ప్రభాకర్.

ఆ విధంగా పార్వతీశం డాక్టర్ (మిస్) స్నేహలతారావు పేషంటయ్యాడు. ఆయన తేరుకోవటానికి గంట కంటె పట్టలేదు.

ఆయన కళ్ళు తెరవగానే డాక్టరు మొహం దగ్గిరగా కనిపించి, ఎవరో దేవతాస్త్రీ అని, తాను చచ్చి స్వర్గం చేరుకున్నానని భ్రమ పుట్టుకొచ్చింది.

"ఇప్పుడెట్లా ఉన్నది?" అన్నదామె ఇంగ్లీషులో.

"బాగానే ఉన్నది. ..మీ రెవరు తల్లీ?"

"నేను డాక్టరును. మీరు భోంచేసి ఎన్నాళ్ళయింది.?"

"ఎన్నాళ్లా ?....ఏదీ....ఇవాళేంవారం ?....అన్నట్టు, నేను రైలెక్కానే.... ఇదేవూరు ?" అని అకస్మాత్తుగా మాట్లాడడం మొదలుపెట్టాడు పార్వతీశం.

"మీరు రైల్లో శోషొచ్చి పడిపోయారు. ఆ స్థితిలోనే మద్రాసు చేరారు. మా క్లినిక్కులో ఉన్నారిప్పుడు. మీరు చూస్తే బీదగాకూడా లేరే ! తిండి లేకుండా ఎందు కుండవలసి వచ్చిందీ ?"

పార్వతీశం మొహం చిట్లించి, "అదంతా చాలాకథ ఉందిలే, అమ్మా. దాన్ని గురించి నా కిప్పుడు జ్ఞాపకం చెయ్యకు" అన్నాడు.

"మీకు జబ్బేమీలేదు. కావాలంటే ఈ మధ్యాన్నం మీరు కడుపునిండా తినెయ్యొచ్చు దాన్నిగురించి బెంగలేదు. మీ రసలు ఎక్కడికని రైలెక్కారు? ఎక్కడికి పోతున్నారు? మీ దగ్గిర డబ్బుగాని, టిక్కెటుగాని లేదు. ఎవడో మీ జేబు కొట్టేసిఉంటాడు. మీరు తెలుసుకునే స్థితిలో లేరు" అన్నది డాక్టరు.

"అదే అయుంటుంది. నేను పట్నానికనే బయలుదేరాను. పరిస్థితులవల్ల అందరూ రిటైరయే వయసులో నేను ఉద్యోగం కోసం బయలుదేరవలసి వచ్చింది."

డాక్టరు చాలాసేపు ఆలోచించి, "మద్రాసులో మీ కెవరన్నా ఉంటే చెప్పండి, మిమ్మల్ని అక్కడికి చేరుస్తాను" అన్నది.

"మద్రాసులో నా కెవరూ లేరమ్మా ! ఏదో ఒక చిన్న ఉద్యోగం ఇప్పించగలవా ? నా బరువు నీమీద వేస్తున్నాననుకోకు. ఒక మంచి సహాయం చేసినవాళ్ళనే ఇంకోటి అడగబుద్ధవుతుంది" అన్నాడు పార్వతీశం.

"మీరు కాసేపు రెస్టుతీసుకోండి. నేను మళ్ళీవచ్చి సావకాశంగా మాటాడతాను" అని డాక్టరు తన పేషంట్సును చూడబోయింది.

ఆమె ఆతర్వాత చాలాసేపటికి తిరిగి వచ్చి "మీ సంగతి ఒకరితో చెప్పాను. సాయంకాలం ఏదో ఒకటి తేలుతుంది. ప్రస్తుతం మా ఇంటికి పోదాం, పదండి" అన్నది.

పార్వతీశం లేచి, తేలిపోయే కాళ్ళతో ఆమె వెంట వీధిలోకి వచ్చి, టాక్సీ ఎక్కాడు. టాక్సీ ఒక మైలు, మైలున్నరదూరం వెళ్ళాక ఒక ఇంటిముందు ఆగింది.

అది డాక్టరుండే ఇల్లు. చాలా సామాన్యమైన ఇల్లు. గేటుమీద చిన్న సైన్ బోర్డుమీద 'డాక్టర్ (మిస్) స్నేహలతారావు ఎం. బి. బి. ఎస్.' అని రాసివుంది. ఆ ఇంట్లో ఆమె తల్లీ, అన్నకూడా ఉంటున్నట్టు పార్వతీశం అర్థం చేసుకున్నాడు. వాళ్ళు తెలుగువాళ్లే.

ఇంటిముందు వసారాలో అయిదారు కుర్చీలున్నాయి. అందులో ఒక పడక కుర్చీ చూపించి, పార్వతీశాన్ని అందులో పడుకుని రెస్టుతీసుకోమన్నది డాక్టరు.

చాలాసేపు ఎవరూ పార్వతీశాన్ని పలకరించలేదు.

కాని లోపల జరిగే సంభాషణ అంతా ఆయనకు వినిపిస్తూనే ఉన్నది. చాలా ప్రేమాంతఃకరణలుగల సంసారం అనిపించింది పార్వతీశానికి.

కొంతసేపయాక డాక్టరు అన్న కాబోలు ఇవతలికొచ్చి, "స్నానంచేస్తారా బాబుగారూ? బాత్‌రూం చూపిస్తాను.... అదుగో టవల్.... సోప్, ఆ బట్టలు విడి చెయ్యండి నేను వేరే పంచా చొక్కా ఇస్తాను." అన్నాడు, తనను చాలాకాలంగా ఎరిగున్నవాడిలాగా.

పార్వతీశం స్నానంచేశాడు. కాని తనబట్టలే వేసుకున్నాడు. స్నానంతో ముప్పాతిక బలం తిరిగివచ్చింది. తరవాత టేబిల్‌దగ్గిర కూర్చుని డాక్టరూ, ఆమె అన్నా, పార్వతీశమూ భోజనం చేశారు. డాక్టరుతల్లి వడ్డించింది. ఉప్పు, కారమూ చాలా మితంగాగల భోజనం. కాని పార్వతీశం నోటికి అమృతం లాగుంది.

భోజనం అయినాక వసారాలో మంచం ఒకటి వేయించి, పార్వతీశాన్ని రెస్టు తీసుకోమన్నది డాక్టరు. పార్వతీశం బుర్ర మాత్రం రెస్టు తీసుకోలేదు. దాని కల్లోలంలో అది ఉండగానే ఆయన శరీరం కునుకుతీసింది.

సాయంకాలం నాలుగ్గంటల వేళ ప్రభాకర్ కారు తీసుకుని డాక్టరింటికి వచ్చాడు. అతను పార్వతీశాన్ని చూచి నవ్వుతూ "ఇప్పుడెల్లావుంది?" అని అడిగాడు.

ప్రభాకర్‌ను మొట్టమొదటిసారి చూస్తున్న పార్వతీశం ఆశ్చర్యపోయి, తప్పుచేసి దొరికిపోయినవాడులాగా "ఏం? బాగానే వున్నానే!" అన్నాడు.

ప్రభాకర్ ఇంకొంచెం విశాలంగా నవ్వుతూ "ఈ ఉదయం మీరు ఏమంత బాగాలేరు." అన్నాడు ఇంగ్లీషులో.

తనతో ఇంత చొరవగా మాట్లాడే అధికారం ఈ మనిషి కెవ్వరిచ్చారను కున్నాడు పార్వతీశం. ఆయనలోని అహంకారం క్షణంపాటు పడగ పైకెత్తి మళ్లా దించేసుకున్నది. ఈ క్షణంలో తనకన్న నిస్సహాయుడు ప్రపంచంలో ఉండడు. వీళ్ళు మంచివాళ్ళు. తనను ఈ మాత్రమైనా పలకరిస్తున్నారు. తనలో ఈ రకమైన ఇంటరెస్టయినా తీసుకుంటున్నారు!

దారిలో ప్రభాకర్ పార్వతీశంతో "మీకు ఉద్యోగం అవసరమని విన్నాను. మీకు అభ్యంతరం లేకపోతే నా పర్సనల్ ఎకౌంట్స్ చూస్తూ ఉండొచ్చు మా ఇంట్లోనే. మీకో రూంకూడా ఇస్తాను। మిమ్మల్నెవరూ డిస్టర్బ్ చెయ్యరు" అన్నాడు.

థాంక్స్ చెప్పాలని పార్వతీశానికి తెలుసు. కాని నోటంట ఆమాట రాలేదు. "మీ ఇష్టం. ఇప్పటి నా స్థితిలో అదే పదివేలు" అన్నాడు ఆయన.

డాక్టరును క్లినిక్ దగ్గిర దించి ప్రభాకర్ పార్వతీశాన్ని తన యింటికి తీసుకుపోయాడు. అది పెద్దయిల్లు. చుట్టూ పెద్ద ఆవరణ ఉన్నది. తోటమాలి ఉన్నట్టున్నాడు. రకరకాల పూలమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి.

ఈ ప్రభాకరం ఎవడోగాని చాలా డబ్బున్నవాడే అనుకున్నాడు పార్వతీశం.

"మా ఇల్లు ఓ చిన్న రహదారి బంగళా. ఇక్కడ శాశ్వతంగా ఉండేది మా తోటమాలి, వంటవాడూ, ఒక క్లీనర్ కుర్రాడూనూ. నాకు కార్లవ్యాపారం మొదలు కొని సిమెంటు పరిశ్రమదాకా అనేక వ్యాపారాల్లో షేర్లున్నాయి. కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే మొట్టమొదట ఉరితీసేది నా బోటివాళ్ళనే. నేను మీకేదో పెద్ద ఉపకారం చేస్తున్నాననుకోవద్దు. డాక్టరు కోరితే నేనేదైనా చేస్తాను. ఈ మెట్లపక్క కింది గది మీరు వాడుకోండి. మీకు నెలకొక వంద రూపాయలు ఇస్తాను. మీ పరిస్థితిని బట్టి నెల జీతం మీకు ముందే ఇస్తూంటాను; మీరు ఏనాడు మానుకున్నా నేను అభ్యంతరం చెప్పను. ఎన్నాళ్ళున్నా నాకేమీ అభ్యంతరంలేదు.... ఈ గది అతిథుల కోసం ఏర్పాటుచేసిన గది. ఇందులో మంచం వున్నది. పక్కనే బాత్‌రూం కూడా వున్నది. మీకేమైనా ప్రత్యేక సదుపాయాలు కావాలంటే, అడగండి చేయిస్తాను." అని ప్రభాకర్ పార్వతీశానికి ఉన్న సంగతి చెప్పేశాడు, పది పది రూపాయల నోట్లు అందిస్తూ.

పార్వతీశానికి తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టనిపించింది అతని మాటలు వింటూంటే. తాను పట్టుదల అలంకారంగాగల పార్వతీశం, ధర్మం పుచ్చుకుని, ఉత్తుత్త ఉద్యోగం చెయ్యటమా? ఇటువంటి సూచన రెండు రోజులక్రితం ఎవరన్నా చేసివుంటే తనకు ఎంత ఆవేశంవచ్చి ఉండేది? కాని ఈ క్షణాన తనలో ఏ ఆవేశమూ లేదు. ఇది స్వయంకృతాపరాధం. తాను కూతురి ఇంటినుంచి వచ్చేటప్పుడు తనను అవహించినదే తన జీవితానికి ఆఖరు ఆవేశంలాగుంది. యుద్ధాలకు స్వస్తి చెప్పడానికి యుద్ధం అన్నట్టుగా ఆవేశాలకు స్వస్తిచెప్పటానికి తాను తెచ్చుకున్న ఆవేశం అది. ఇప్పుడు తాను ఈ ప్రభాకర్ ఆశ్రయం వద్దని, అతని డబ్బును నిరాకరించి ఏమవుతాడు? ఆత్మహత్య చేసుకోవాలి. అయితే అటువంటి ఆలోచన పార్వతీశానికి ఏ కోశానా కలగటంలేదు.

అందుచేత ఆయన యాంత్రికంగా చెయ్యిచాచి, ప్రభాకర్ ఇచ్చిన డబ్బు తీసుకుని, అతను చూపిన గదిలో ప్రవేశించాడు. తోటమాలి వచ్చి గది తలుపు తెరిచి, ఆ గది తాళం చెవి పార్వతీశం చేతిలో పెట్టాడు.

పార్వతీశం ఆ గదిలో ఉన్న కుర్చీలో కొంచెంసేపు చేరగిలబడి కూర్చుని, ఆలోచనలకు ఎరవేశాడు. కాని ఎంతసేపు గడిచినా ఒక్క చెప్పుకోదగిన ఆలోచనా ఎరను కాదనలేదు. పార్వతీశం లేచి బయటికి వచ్చి, గదితలుపు మూసి, తాళంవేసి, తాళం చెవి జేబులో పెట్టుకుని, తనకు కావలసిన బట్టలు కొనుక్కునేటందుకు బయలుదేరాడు.

బయటికి వచ్చినాక ఆయనకు ఆ డబ్బుతో ఎక్కడైనా వెళ్ళిపోదామనే ఆలోచన కూడా వచ్చింది. కాని అది ఆయన తత్వానికి సరిపడలేదు. తన కింకా ఒక తత్వమంటూ ఉన్నందుకు ఆయన ఆశ్చర్య పోయాడు. ఒక గంటసేపు రోడ్ల వెంట అటూ ఇటూ తిరిగి ఒక ఖాదీ భాండారం కనిపిస్తే అందులోకి జొరబడి రెండు ఖద్దరు

పంచలూ, రెండుఖద్దరు జుబ్బాలూ కొనుక్కున్నాడు. ఆ దగ్గిరలోనే హోటలుంటే అందులో భోజనం చేసి తాపీగా ఇంటికి తిరిగి వచ్చాడు.

మంచంమీద పడుకుంటే ఎంతకూ నిద్ర పట్టలేదు. కొస మత్తులాంటిది వచ్చి అంతలోనే పోయింది. దానికి కారణం బయట కారు హారన్ వినిపించటమూ, కారులైట్లు కిటికీ రెక్కలమీద జిగేలు మనటమూనూ.

ఇద్దరు ముగ్గురు మనుషులు మాట్లాడుకుంటూ మెట్లకేసి వచ్చారు. గొంతులనుబట్టి డాక్టరూ, ప్రభాకరూ అని పార్వతీశం పోల్చుకున్నాడు. మూడో గొంతు వినిపించలేదు. ఇద్దరూ మెట్లెక్కి పైకి వెళ్ళిపోయారు. వాళ్ళ అడుగుల చప్పుడును బట్టి ఒకరి గమనాన్ని ఒకరు భంగంచేస్తున్నట్టు స్పష్టమయింది.

మహా గడ్డు పరిస్థితిలో తనను ఆదుకున్న డాక్టరు మిస్సమ్మ ఏమంత నీతిగా బతుకుతున్న మనిషికాదు ; రాత్రి పదిగంటల వేళ పరాయివాడి ఇంటికి వచ్చింది. అర్ధరాత్రిదాకా మళ్ళీ దిగి రాలేదు.

దిగివచ్చేటప్పుడు డాక్టర్లు మెట్లమీద విరగబడి నవ్విన పద్ధతీ, ప్రభాకర్ 'స్టాప్' అన్న పద్ధతీ చూస్తే, వాళ్ళు బాగా తాగినట్లుకూడా పార్వతీశానికి అనుమానం కలిగింది. అటువంటి మనిషి దయా ధర్మాన్ని తాను స్వీకరిస్తున్నాడు.

నిజమే. ఈ డాక్టరు తన పరువు తీసెయ్యలేదు. ఆమె ప్రవర్తన తనను అంటదు. ఎందుచేత ? తా నీ క్షణంలో సామాజిక వ్యక్తి కాదు గనక ; తనకు ఏ అడ్రసూ లేదుగనక ; తనకు మొదలు పరువే లేదుగనుక.

ఆమె ప్రవర్తనను శాసించేటందుకు తనకు ఏ విధమైన అధికారమూ లేదు. తన కూతురిమీద ఉన్నదని తాను అనుకున్నాడు. అక్కడా తన కే అధికారమూ లేదేమో ? రేపు ఉదయం తాను వెళ్ళొస్తానని చెబితే డాక్టరు ఎంత మథనపడుతుందో; తాను వచ్చేసినందుకు వర్ధనికూడా అంతే మథనపడి ఉంటుంది. ఒకవేళ అంతకన్న ఒకపిసరు హెచ్చుగా బాధపడితే అది ఆమె మంచితనమే గాని, తనకుగల అధికారానికి నిదర్శనం మటుకు కాదు.

కారు బయలుదేరినట్టు చప్పుడయాక పార్వతీశానికి అకస్మాత్తుగా ఒక భయం పట్టుకున్నది. ప్రభాకర్ తాగివుండి ఆక్సిడెంట్ చేస్తే ? డాక్టరు కేదైనా ప్రమాదం జరిగితే ? డాక్టరుకు ప్రమాదం జరగటమనేది ఊహించుకుంటేనే ఆయనకేదో బాధ కలిగింది.

తిరిగి కారు క్షేమంగా కొంపకు చేరిన చప్పుడు విన్నాకగాని ఆయన మనసులోని ఆరాటం తగ్గలేదు. ఆ తరవాత నింపాదిగా నిద్రలోకి జారుకుంటూ డాక్టరు జీవితాన్ని ఊహించుకోవటానికి ప్రయత్నించి, విఫలుడై, క్రమంగా గాఢ నిద్రలో పడిపోయాడు పార్వతీశం.

మర్నాడు ఏడుగంటలకల్లా పార్వతీశం తన కాలకృత్యాలన్నీ తీర్చుకుని ప్రభాకర్ కోసం ఎదురు చూడసాగాడు. ప్రభాకర్ డ్రెస్ చేసుకుని కిందికి దిగి వచ్చే సరికి తొమ్మిది దాటింది.

"ఎక్కడికో ప్రయాణమయినట్టుందే ?" అన్నాడు ప్రభాకర్, పార్వతీశం ధరించిన ఖద్దరు బట్టలకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"డాక్టరును ఒకసారి చూడాలి. నన్ను వాళ్ళ క్లినిక్ లో దింపగలరా ?" అన్నాడు పార్వతీశం.

"బై ఆల్ మీన్స్ ! రండి."

ప్రభాకర్ క్లినిక్ లోకి రాలేదు. అతను క్లినిక్ లోకి పేషంట్ గా తప్ప అడుగు పెట్టరాదని డాక్టరు శాసనం - ఆ సంగతి పార్వతీశానికి తెలీదు.

పార్వతీశాన్ని చూడగానే డాక్టరు నవ్వి, "ఎట్లా ఉన్నారు ? హోప్ యూ ఆర్ పర్ఫెక్ట్లీ నార్మల్" అన్నది.

"నేను బాగానే ఉన్నానమ్మా....పది నిమిషాలు నీకు తీరిక వుంటే నా సొంత సోది కొంత చెప్పాలి !" అన్నాడు పార్వతీశం.

"చెప్పండి. ప్రస్తుతం నేను బిజీగాలేను. ఇప్పుడే పేషంట్ల నందరినీ చూసి వచ్చాను" అన్నది డాక్టరు.

పార్వతీశం సంక్షిప్తంగా తన కథ అంతా చెప్పాడు. తన కూతురి గురించి చెప్పాడు.

"నాకు జీవితం అర్థంకాలేదను లేదా నేను కొంచెం పిగ్ హెడెడ్ అను. ఒక పద్మవ్యూహంలాంటిదాన్లో చిక్కుకొని ఏం చెయ్యాలో తెలీని స్థితిలో పడ్డాను. నీ సలహా ఏమిటి ? నేను నిజంగా మీ చారిటీమీద బతకతగినవాణ్ణి కాను. అది నా మనస్తత్వం కాదు" అని ఆయన తన కథ ముగించాడు.

"మీ అమ్మాయి దగ్గిరికి తిరిగి వెళ్ళండి ; ఆవిడ మానాన ఆవిడను బతక నివ్వండి. ఆడది పెళ్ళి చేసుకుని గృహిణిగానూ, పిల్లల తల్లిగానూ బతకడం తప్ప మీరు మరోమాదిరి జీవితం ఊహించలేకుండా ఉన్నారు. మీ రామె జీవితాన్ని ఒక వెంట్రుకవాసి కదపలేరు. అందులో జోక్యం ఎందుకు కలిగించుకుంటారు ?" అన్నది, డాక్టరు.

"కాని, మనిషికి కొన్ని కట్టుబాట్లుండవద్దా ? ఒకరు చేసిన పనే అందరూ చేస్తే ఏమవుతుంది ? మనిషి ప్రవర్తనను నిర్ణయించే గీటురాయి అది కాదా ?" అన్నాడు పార్వతీశం.

"ఎవరన్నా రామాట ? అందరూ డాక్టర్లయితే ఏమవుతుందని నే ననుకోలేదు. అందరూ టీచర్లయితే ఏమవుతుందని మీ అమ్మాయి అనుకోలేదు బహుశా. మగవాడు

ప్రభాకర్ లాగా బ్రహ్మచారిగా ఉండిపోతే సంఘాని కెంత నష్టమో నా బోటిదీ. మీ అమ్మాయి బోటిదీ పెళ్ళి కాకుండా ఉండిపోతే అంతే నష్టం. ఒకప్పుడెప్పుడో ప్రిమిటివ్ కమ్యూనిటీలలో అందరికీ ఒకే నియామాలుండేవిట. ఈనాడు మనమింకా అదే మనస్తత్వంతో జీవించటం చాలా హాస్యాస్పదం. మనిషి నుంచి మనిషికి సాధ్యమైనంత హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవటమే సరి అయిన ప్రవర్తన. మిగిలిన బూటకపు నీతినియమాలను నమ్మకండి" అన్నది డాక్టరు.

ఆ మధ్యాన్నం జనతాలో పార్వతీశం తిరుగు ప్రయాణమైనప్పుడు ఆయన గొంతులో గరళం ఉండివున్న లక్షణాలేవీలేవు.

ముద్రణ:

*ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, మే, 17, 1968*

(22-4-68 Sent one more Story (*చెడిపోయిన మనిషి*) to A. *జ్యోతి అని కొ.కు నోట్సు: కొడవటిగంటి వరూధినిగారు అందించిన ప్రకారం*)